జగనన్న ప్రభుత్వంలోనే సామాజిక న్యాయం

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- రేకలకుంటలో విజయవంతమైన యాదవుల ఆత్మీయ సమ్మేళనం
- రూ.1.25కోట్లలో రాణిబావి గంగమ్మ ఆలయ పునఃనిర్మాణం
- భూమిపూజ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



రాణిబావి గంగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన యాదవులు



యాదవ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం : రాష్ట్రంలో సామాజిక న్యాయానికి ముఖ్యమంత్రి జగనన్న పెద్దపీట వేశారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంటలో గురువారం ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవ ఆత్మీయ సమ్మేళనం విజయవంతమైంది. అంతకు ముందు రేకలకుంటలో పురాతనమైన రాణిబావి గంగమ్మ దేవత ఆలయం రూ.1.25 కోట్ల వ్యయంతో పునఃనిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీలను బ్యాక్ వర్డ్ క్లాస్ గా కాకుండా బ్యాక్ బోన్ క్లాస్ గా ముఖ్యమంత్రి భావిస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనమే రమేష్‌యాదవ్‌ను ఎమ్మెల్సీ చేయడమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగనన్న రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. సర్పంచ్ నుంచి పార్లమెంట్ సభ్యుల వరకూ ఆ వర్గాలకు చెందిన వారికే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి కేబినెట్‌లో 70 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ఉన్నారన్నారు. ఆర్.కృష్ణయ్యను రాజ్యసభకు పంపిన విషయాన్ని గుర్తుచేశారు. ఏలూరు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థులుగా బీసీలనే ఖరారు చేశారని వివరించారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలన్నదే జగనన్న ధ్యేయమన్నారు. కడపలో రూ.5.50 కోట్లతో బీసీ భవన్ ఏర్పాటు చేయనున్నామన్నారు. యాదవ భవన్‌కు 2 ఎకరాల స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మంచి చేసిన ఈ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ కోరారు.

బీసీలకు మేలు చేసింది వైఎస్ జగనే : సురేష్ బాబు

బీసీలకు మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ అధ్యక్షులు కె.సురేష్‌బాబు అన్నారు. బీసీలను చట్ట సభలకు పంపిన ఘనత ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. బీసీలలో యాదవులను అభివృద్ధిలోకి తీసుకురావాలని ఎన్టీఆర్, వైఎస్సార్ హయాంలో ముగ్గురిని ఎమ్మెల్యేలుగా చేయగా వారి కంటే మిన్నగా వైఎస్ జగన్ నలుగురు బీసీలను రాజ్యసభకు పంపారని.. అందులో ఇద్దరు యాదవులు ఉన్నారని తెలిపారు. చంద్రబాబు కేవలం తన సామాజిక వర్గానికే రాజ్యసభ సీట్లు ఇచ్చారని ఆరోపించారు. టీడీపీలో బీసీలకు ప్రాధాన్యత లేదన్నారు. యాదవులకు జిల్లాలో ఎన్నో పదవులు ఇచ్చిన ఘనత జగన్‌దేనన్నారు. రాష్ట్రంలో కులాలకు మతాలకు పార్టీలకతీతంగా వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మోసగించి ఇప్పుడు మళ్లీ భవిష్యత్తు గ్యారంటీ అంటూ ప్రజల వద్దకు వస్తున్నారని విమర్శించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని దీవించాలని.. 175కు 175 సీట్లు వచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

టీడీపీ పెత్తందార్ల పార్టీ : ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

టీడీపీ పెత్తందార్ల పార్టీ అని ఆ పార్టీకి అధికారం కట్టబెడితే రాష్ట్రంలో పెత్తందార్ల పాలన తప్పదని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. చంద్రబాబు పెత్తందార్లకే పెద్ద పెద్ద పదవులు ఇచ్చారని రాష్ట్రంలో 3.5 శాతం ఉన్న కమ్మ కులానికే స్పీకర్, మంత్రి పదవులు ఇచ్చారని ఆరోపించారు. వైఎస్ జగన్ అన్ని కులాలను, మతాలను ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. యాదవులను అభివృద్ధిలోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఉన్న రమేష్‌యాదవ్‌ను పిలిచి ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారని తెలిపారు.

వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటాను : ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

సమ్మేళన సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ ఆర్.రమేష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. తనకు ఎమ్మెల్సీ ఇవ్వడం ద్వారా జిల్లా చరిత్రలోనే ఒక యాదవ్ చట్ట సభకు వెళ్లేందుకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అందుకు కృషి చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మొత్తంగా వైఎస్ కుటుంబానికి తాను ఊపిరి ఉన్నంత వరకూ రుణపడి ఉంటానని అన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగనన్న ప్రభుత్వంలోనే పదవులు దక్కాయన్నారు. ఇవ్వలేదన్నారు. బాలయ్య అనే వ్యక్తిని జడ్పీ వైస్ చైర్మన్‌ను చేయడం గొప్ప విషయమన్నారు. యాదవులంతా ఏకతాటిపై సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలబడి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

■ సమ్మేళనంలో మైదుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు శివ యాదవ్, జడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్, కడప మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త బంగారు నాగయ్య యాదవ్, చాపాడు ఎంపీపీ లక్షుమయ్య యాదవ్, దువ్వూరు జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ తదితరులు మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా యాదవ సంఘం నాయకులు, బీసీ సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో కూలీలకు ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి శివకుమార్, వి అన్వేష్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామాల్లో ఉపాధి పనులను కల్పించాలని కోరుతూ డ్వామా పీడీ యధుభూషణ్ రెడ్డి కి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు.

గ్రూప్ -2 ప్రిలిమ్స్ పరీక్ష వాయిదా వేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్ నెల రోజుల పాటు వాయిదా వేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల కోరిక మేరకు నెల రోజుల పాటు గ్రూప్- 2 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా నరసింహులు, డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ



రాయల్ రషీదు పుస్తకాన్ని అవిష్కరిస్తున్న ఏపీభవన్ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్‌భవన్‌లో ప్రముఖ సీనియర్ ఫ్రీలాన్స్ పోటోగ్రాఫర్ కమ్ జర్నలిస్టు దివంగత హాజీ షేక్ అబ్దుల్ రసీద్(రాయల్ రషీదు) జీవిత చరిత్ర పుస్తకాన్ని ఏపీ భవన్ రిటైర్డ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పూర్ణచంద్రరావు ఆవిష్కరించారు. ఏపీ భవన్ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ పర్సనల్ సెక్రటరీ హరీష్, ఏపీ భవన్ డివిజనల్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సందీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీభవన్ అధికారులు మాట్లాడుతూ రాయల్ రషీద్ తనయుడు రాయల్ షబ్బీర్ తన తండ్రి పుస్తకాన్ని ఆవిష్కరించడం ప్రశంసనీయం అన్నారు. రాయల్ షబ్బీర్ కూడా తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ మౌలానీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసి పలు సేవలందిచడం అభినందనీయం అన్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న కళాశాల అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : మనం చేసే రక్తదానం అత్యవసర సమయాల్లో మరొకరికి ప్రాణదానం అవుతుందని ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు. గురువారం కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ పీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదానం శిబిరంలో పొద్దుటూరుకు చెందిన ప్రభుత్వ హాస్పిటల్ రక్తనిధి కేంద్రానికి సంబంధించిన అధికారులు, విద్యార్థులతోపాటు పలువురు అధ్యాపకులు రక్తదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

7 నుంచి మొల్లమాంబ సప్త శతాబ్ది ఉత్సవాలు

కడప కల్చరల్ : తొలి తెలుగు రామాయణ కవయిత్రి, మన జిల్లా ఆడబిడ్డ, మహాకవయిత్రి మొల్లమాంబ సప్త శతాబ్ది (700 సంవత్సరాల)సాహితీ సాంస్కృతిక కళా ఉత్సవాలను మార్చి 7 నుంచి 14వ తేది వరకు నిర్వహించనున్నట్లు మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు. గురువారం ఆయన ఇతర సభ్యులు వెల్లాల వెంకటేశ్వరాచారి, కొండూరు స్వర్ణలత, మల్లయ్యలతో కలిసి నగరంలోని మొల్లమాంబ విగ్రహం వద్ద విలేకరులకు ఈ విషయాలు తెలిపారు. మార్చి 7 నుంచి గోపవరం, బద్వేలు, ఒంటిమిట్ట, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడపలో మొల్లమాంబ సాహితీ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మొల్ల సాహిత్య సేవా పురస్కారాలను అందజేస్తామన్నారు.

ఎస్టీపీని అందుబాటులోకి తేవాలి



ఎస్టీపీ వద్ద పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ని త్వరగా అందుబాటులోకి తేవాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. గురువారం స్థానిక నానాపల్లి సమీపంలో ఏర్పాటు చేయనున్న ఎస్టీపీ పనులను ఆయన పరిశీలించారు. అందులో మోటార్లను పరిశీలించి వాటి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. 20ఎంఎల్‌డీ నీటిని ట్రీట్‌మెంట్ చేయువిధంగా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. నగరంలో కాలువల ద్వారా నీటిని ఎస్టీపీ వరకూ తీసుకురావాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించి ఎక్కడైనా గ్యాప్స్ ఉంటే మరమ్మతులు చేయాలని సూచించారు. ఉక్కాయపల్లె, నానాపల్లి, వైఎస్‌ఆర్ కాలనీ లేఅవుట్లలో యూజీడీ ఏర్పాటు చేయాలని, ఆ నీటిని ఎస్టీపీకి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు కడప రాయుడి తిరునాల

కడప కల్చరల్ : జిల్లాలో అత్యంత వైభవంగా జరిగే తిరునాలలో కడప రాయుని తిరునాల ఒకటి. దేవునికడపతోపాటు కడప నగరం నుంచి ఈ ఉత్సవానికి భారీగా భక్తులు తరలివస్తారు. నగర పరిధిలో జరిగే పెద్ద ఉత్సవం, జనం కూడా భారీగా వచ్చే ఉత్సవం గనుక ఈ తిరునాల సందడే ప్రత్యేకంగా కనిపిస్తుంది. అందుకే దేవునికడప తిరునాలకు జిల్లా వ్యాప్తంగా ఎంతో ప్రత్యేకత ఉంది.

కడప నగరంతోపాటు దేవునికడప, పాతకడప మాత్రమేక కాకుండా చుట్టుపక్కల గల దాదాపు 20 గ్రామాల నుంచి భక్తులు తరలి రానున్నారు. గురువారం కల్యాణం పూర్తి కాగానే రథోత్సవానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. రథానికి ఇప్పటికే ఆకర్షణీయంగా రంగులు వేసి దారు శిల్పాలు, రంగురంగుల వస్త్రాలంకరణ, పూలు, ఇతర ఆకర్షణీయమైన వస్తువులతో కనుల పండువగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లను శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలనంతరం తేరుపై కొలువుదీరుస్తారు. భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు.

తేరుపై స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తారు. స్థానికులు వారికి పానకం, వడపప్పు, బిస్కెట్లు, మజ్జిగ, మంచినీరు తదితరాలను ఉచితంగా అందజేస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల తర్వాత కడప రాయుని రథం కదులుతుంది. తొలుత దేవునికడప, పాతకడప గ్రామ పెద్దల హారతులు, అనంతరం సర్కారు హారతి, ముత్యాల శేషయ్యహారతి తర్వాత రథాన్ని కదిలిస్తారు. మొక్కులుగల భక్తులు రథ చక్రాల కింద గుమ్మడికాయలను ఉంచడం ఆనవాయితీ.



దేవునికడప రథం

తిరుణాలకు సందడి

తిరునాల కోసం ఇప్పటికే దేవునికడప మాడవీధులన్నీ దుకాణాలతో నిండిపోయాయి. కేసీ కెనాల్ వద్దనుంచి రోడ్డువారగా వరుసగా చెరుకు గడల దుకాణాలు సందడి చేస్తున్నాయి. ఈ తిరునాలలో ఇవి ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి. ఇవి కాకుండా ఫ్యాన్సీ వస్తువులు, తినుబండారాలు, మహిళల అలంకార వస్తువులు, గుమ్మడికాయల దుకాణాలు కూడా ఏర్పాటయ్యాయి. మాసాపేట కూడలి నుంచి భక్తులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిర్విరామంగా అన్నదానం చేసేందుకు పలుచోట్ల భక్త బృందాలు ఏర్పాటు చేసుకున్నాయి. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తున్నారు. మాడవీధుల్లో తేరు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కదిలేందుకు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శుక్రవారం ఉదయం 9.00 గంటల నుంచి రాత్రి 10.00 గంటల వరకు దేవునికడప ప్రాంతమంతా సందడిగా మారనుంది.

ఎన్‌సీసీ కేడెట్‌కు అభినందన

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ సెకండియర్ బీఏ చదువుతున్న ఎన్‌సీసీ కేడెట్ ఎస్. షబానాను ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా అభినందించారు. ఫిబ్రవరి 1 నుంచి 12వ తేదీ వరకు అస్సాంలో నిర్వహించిన స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో ఈమె పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచింది. క్యాంపు నుంచి తిరిగివచ్చిన ఆమెను గురువారం కళాశాలలో అభినందించారు.

బంద్ జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక చర్యలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా నేతృత్వంలో శుక్రవారం తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామయ్య, పి చంద్రశేఖర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు

కడప అగ్రికల్చర్: రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని కేవీకేలో రైతులకు నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య , వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసాచారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. దీంతోపాటు ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చన్నారు. ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ రామలక్ష్మిదేవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ అడిషినల్ డీపీఎం వసంతకుమారి, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ డీపీఎం రామకృష్ణంరాజులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానాల గురించి తెలియచేశారు. కీటకశాస్త్ర శాస్త్రవేత్త సునిల్‌కుమార్, సేద్య విభాగ శాస్త్రవేత్త సాయి మహేశ్వరి, సామాజిక విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతిలు ప్రకృతి వ్యవసాయంలో పాటించవలసిన పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు స్వామి చైతన్య, మహేష్‌బాబు, మానస, సురేష్, మాధవి రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

ఉర్దూ పాఠశాలల బలోపేతానికి సహకరించండి

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ పరిధితోపాటు జిల్లాలోని ఉర్దూ పాఠశాలల బలోపేతానికి సహాయ సహకారాలను అందించాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి, డీఈఓ మర్రెడ్డి అనురాధలను రూట నాయకులు కోరారు. ఆర్‌జేడీగా పదోన్నతి పొందిన ఆర్‌జేడీ రాఘవరెడ్డి, డీఈఓగా బదిలీపై కడపకు వచ్చిన అనురాధాలను వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ ఆయ్యూబ్, రాష్ట్ర డైరీ కమిటీ చైర్మన్ అబ్దుల్ హకీమ్ సాహెబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.



డీఈఓ అనురాధను సన్మానిస్తున్న రూట నాయకులు

ప్రశ్నించడం ద్వారానే సమాజంలో మార్పు

కడప కల్చరల్ : ప్రశ్నించడం ద్వారానే సమాజం మార్పు చెందుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వ కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు కళాజాత కార్యక్రమం జరుగుతోంది. ఇందులో భాగంగా గురువారం స్థానిక హజరత్ ఆయేషా బాలికల స్కూలులో ముందస్తు కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వక్త రఘునాథరెడ్డి మాట్లాడుతూ సైంటిఫిక్ టెంపర్‌ను పెంచడానికి ఒకవైపు ప్రయత్నాలు సాగుతున్నా మరోవైపు వాటిని తుంచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేవీవీ రాష్ట్ర నాయకులు మురళీధర్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని రక్షించుకునేందుకే సంస్థ ఈ కళా జాత చేపట్టి ఊరువాడ రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శన ఇస్తోందన్నారు. జేవీవీ నాయకురాలు అరుణ, ఐక్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. జేవీవీ నాయకులు డాక్టర్ రాజావెంగల్ రెడ్డి, స్కూలు యాజమాన్యం మజహర్ అలీ ఖాన్, అక్బర్ బాష, ఖలీముద్దీన్, యాసీన్, సుల్తాన్, జేవీవీ రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు, మురళీధర్, తవ్వా సురేష్, సునీత, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలంకి శ్రీరాములు, బాలబయన్న, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్లను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు కోరారు. గురువారం కడప తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ చైర్మన్ శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, ఎస్టీయూ ఇలియాస్‌లు మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన ర్యాలీ నిర్వహించి 27న ఛలో విజయవాడ చేపట్టి ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


కడప కోటిరెడ్డిసర్కిల్ : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీసీ వర్క్‌షాప్ మేనేజర్ రహమతుల్లాకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సర్క్యులర్ ప్రకారం కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ అకౌంట్ కార్మికుల ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. ఈఎస్‌ఐలో కుటుంబ సభ్యులను చేర్చకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

సోదరభావం కలిగి ఉండాలి

కడప ఎడ్యుకేషన్ : పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఒకరిపట్ల ఒకరు స్నేహపూర్వక, సోదరభావాన్ని కలిగి ఉండాలని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ శాంత పేర్కొన్నారు. గురువారం కడప మండల పరిధిలోని ఆలంఖాన్‌పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, స్నేహపూర్వక స్వభావం, సోదరభావం, దేశభక్తి మొదలగు అంశాల పట్ల అవగాహన కల్పిస్తూ.. న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు బ్యాడ్, గుడ్ టచ్‌ల గురించి తెలియచేశారు. దీంతోపాటు బాల్య వివాహాలను చేయడం చట్ట రిత్యానేరం అన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 15100 గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్‌తోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మునిరత్నమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాంకులు సాధించం అభినందనీయం

కడప ఎడ్యుకేషన్ : శ్రీ బీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాల స్థాపించిన అనతికాలంలోనే అత్యధిక ర్యాంకులు సాధించడం అభినందనీయం అని, మొదటి బ్యాచ్‌లోనే 20 మంది విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి సీట్లు సాధించడం ఆల్ ఇండియా స్థాయిలో జిల్లాపేరును వినిపించడం గర్వంగా ఉందని కడప ఆర్‌డీఓ మధుసూదన్, డీఎస్పీ షరీఫ్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సురేష్‌కుమార్, వీసీ కుడ ఓబులేసునందన్ అన్నారు. ఇటీవల విడుదలైన జెఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో జాతీయస్థాయిలో అత్యధిక ర్యాంకులు సాధించడంతో బుధవారం కడప నగరంలో బీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాల ప్రాంగణం నుంచి బీరం సస్పెక్ పేరుతో విద్యార్థులు, సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని కడప ఆర్‌డీఓ, డీఎస్పీ, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, వీసీ కుడ ప్రారంభించారు. అనంతరం జెఈఈ మెయిన్స్‌లో ప్రతిభచాటిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీరం కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి చైర్ పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, స్కూల్ ప్రిన్సిపాల్ శ్వేత పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కడప ఆర్‌డీఓ మధుసూదన్ తదితరులు